(ఆంధ్రపత్రిక వీక్లీ 19-11-1960 దీపావళి కథలపోటీ రెండో బహుమతి)

వెన్నెలనీడ

సామర్లకోట రైల్వేస్టేషను.

మద్రాసు వెళ్ళే మెయిలు.

రైలెక్కి ఒక్క నిమిషం అయివుంటుంది. వెంకటేశ్వర్లు పోర్టరుచేత సామాన్లు సర్దించి, అతనికి డబ్బులిచ్చేసి, సీట్లో చతికిలబడి భార్యా బిడ్డలవేపు, ఆనక కంపార్టుమెంట్లో మిగిలిన వాళ్ళవేపు కలయజూశాడు.

కార్నర్ సీట్లో ఆయనా, శ్యామలా ఒకర్నొకరు పరీక్షగా చూసుకొంటున్నారు.

ఒకసారి ఆయనవేపూ, ఒకసారి శ్యామలవేపూ చూసి మళ్ళీ ఆటు తిరిగాడు వెంకటేశ్వర్లు.

"ఎందాకా వెళుతున్నారండి. మీరు?" అని అడిగాడు. "మి?-ఒంగోల్!" అన్నాడతను ఇటు చూడకుండానే.

శ్యామల పిల్లను ఎదటి బెంచిమీద నుంచి ఈ బెంచి మీదికి మార్చి ఎడం చేత్తో జోకొడుతూ అతనివేపు అలా చూస్తూనే వుంది.

ఒక నిమిషంపాటు ఎవరూ మాట్లాడలేదు. వాళ్ళిద్దరూ అలా చూసుకోడం వెంకటేశ్వర్లుకి ఏమీ బాగాలేదు.

అతను శ్యామలకి బంధువో, స్నేహితుల కుటుంబంలోని వాడో అయి వుండాలి, ఇద్దరికిద్దరూ గుర్తు తెచ్చుకోలేక పోతున్నారని తెలుస్తూనే వుంది. తనేమీ సాయం చెయ్యలేక, భరించలేక అలా చూస్తూ కూచున్నాడు, అతను కూడాను.

"మీ దేవూరండి!" అంది శ్యామల హఠాత్తుగా.

"తుని! మీదో?"

"కాకినాడ. మీరు కాకినాట్లో చదివారా?....ఒకవేళ మా అన్నయ్య కోసం మా యింటికి వస్తుండేవారా? మిమ్మల్నెక్కడో చూశాను!"

"నన్ను చెప్పమంటారా?" అని అతను చిరునవ్వుతో వెంకటేశ్వర్లువేపు చూశాడు. "ఎక్స్‌క్యూజ్ మీ—"

వెంకటేశ్వర్లు సమస్య విడిపోయినంత ఆనందం చూపిస్తూ నవ్వాడు. "చెప్పండి చెప్పండి—ఎక్కడో ఎప్పుడో చూసుంటారు, అసలు చిన్నప్పటి ఫ్రెండ్సుని వొకో సమయంలో గుర్తుపట్టలేం.-నా కట్టా చాలా సార్లైంది!" మరచిపోవడం తప్పులాంటిదని తెలిసినా ఇబ్బందైన పరిస్థితిని వీలయినంత త్వరగా దాటెయ్యాలని ఆతని ప్రయత్నం.

"సారీ, ఎట్లా చెప్పాలో నాకు తెలీటంలేదు!" అని చిరునవ్వు నవ్వి "ఇఫ్యూ డోంట్ థింక్ అదర్‌వైజ్—" అని ఇంగ్లీషులో మొదలుపెట్టి, "ఆమెని వొకప్పుడు వాళ్ళింటిలోనే పెళ్ళిచూపుల తతంగంలో చూశాను.ఆమెని పెళ్ళాడిన అదృష్టవంతులు మీరేననుకుంటాను." అన్నాడతను.

వెంకటేశ్వర్లు షాక్‌తిన్నాడు. కాని ఆ సంగతి తెలీకుండా ఏదో అందామని "నేనూ అదే అనుకున్నాను. లేకపోతే అంత తొందరగా యెట్లా మరచిపోతాం?" అన్నాడు. పరిస్థితి సరిగా అదుపులోకి రాలేదని అతని కదలికలవల్ల తెలిసిపోతోంది.

"ఇప్పుడేం చేస్తున్నారండీ!" అనడిగింది శ్యామల, మెరిసే కళ్ళతో.

ఆరేళ్ళక్రిందట—అతను తనను చూడ్డానికొచ్చినప్పుడు—తను పది హేడేళ్ళ పడుచు. స్కూలుఫైనలు పాసయింది. ఇంటరూ, డిగ్రీకోర్సూ చదువుదామని తన ఉద్దేశ్యం. పెళ్ళిచేసి అత్తారింటికి పంపుదామని మిగతా వాళ్ళందరి ఉద్దేశ్యం. మెజారిటీ నిర్ణయం నెగ్గింది.

అప్పటికీయనకు ఇరవై రెండేళ్ళుంటాయేమో! సంపెంగవాసన పూసుకొచ్చిన వెన్నెల్లాంటి మత్తుసౌందర్యం అతనిది. గుండ్రని మొహంమీద నాకెందుకని వెనక్కి పారిపోయిన క్రాఫింగూ, ముందుకొచ్చేసిన ముక్కూ. మధ్య లొత్తతో గడ్డం, పేరుకు తగినట్టుగా "మనోహరంగా" ఉన్నాడని తను అనుకోడం, చూడ్డం తనకింకా జ్ఞాపకం వస్తున్నాయి "చూపులకొచ్చిన మొగకుంకని అలా చూస్తే వాడేమయిపోతాడూ!"అని మేనమామ దెప్పిపొడుస్తే—నలుగుర్లోనూ చెప్పరాని సిగ్గేసింది.

ఎంత చదువయితే ఉండనీ గాని. ఆస్తిలేని వాడికివ్వకు—అంటూ అమ్మమ్మ నాన్నకు చెప్పింది. ఎం. ఏ. ప్యాసయిన్నీ తాలూకా కచేరీ గుమాస్తా పనికి సిద్ధమై పోతున్నారని నాన్న అభిప్రాయపడ్డాడు. వాళ్ళేమీ కట్నం అక్కర్లేదన్నారని వాళ్ళు అందరికీ హీనంగా కనబడ్డారు. "డిప్టీ కలెక్టరు కొడుకయితే మాత్రం? అయినా రిటైర్డు! ఏమిటో పోనిస్తూ; ఇంతకూ పిల్లకి ఏమంత

వయస్సు మీరిపోయిందని? ఇంకో సమంధం రాకపోదులే—" అన్నాడు మామయ్య.

కృష్ణాజిల్లా గన్నవరం తన అత్తవారిది. వెంకటేశ్వర్లు వాటాకు వాళ్ళ నాన్నగారు పోయాక, పదెకరాలు, అదీ ఇదీ కలిసివచ్చింది. బియ్యే ప్యాసయి సర్వీసు కమీషన్‌తో సెలక్టయి, అక్కడా అక్కడా చేసి బెజవాడ సబ్ కలెక్టరు ఆఫీసులో గుమాస్తాగా ఉంటున్నాడిప్పుడు. తనను పెండ్లాడిన ముహూర్త బలమో, తన అదృష్టమో అన్నారు; చకచకా రెవిన్యూ టెస్టులూ. ఎకవుంట్సూ అవీ ప్యాసయి యూ. డీ. సీ. అయినాడు. రెండు చేతులా సంపాదిస్తాడు.

తన పుట్టింటారైనా—ఏమాట కామాటే చెప్పుకోవాలి—మంచి సంబంధమే చూశారు. వాళ్ళు కావాలనుకున్నవన్నీ వెంకటేశ్వర్లులో వున్నాయి. పైగా సరసుడూ, సహృదయుడున్నూ. వ్యవహార దక్షులయిన కొందరు గుమాస్తాలు పార్టీల్లో అలవాటు పడిపోయి, గృహజీవితంలోనున్నూ చాతుర్యం ప్రదర్శించి తన-పరభేదం మరిచిపోతారు. వెంకటేశ్వర్లు అట్లాటివాడు కాదు. అతనికి శ్యామలంటే చెప్పలేని ప్రేమాభిమానాలు.

చూసిన వాళ్ళందర్నీ పెళ్ళి చేసుకోలేం కదా. ఒక మనిషి ఒక మనిషినే పెళ్ళాడొచ్చు. మిగతా వాళ్ళందరూ అరగంట పరిచయంతో అనంతంగా చీలిపోతారు. ఎప్పుడో, ఎక్కడో వుంటూ "ఫలానా వారబ్బాయిలేడూ—ఆ రోజు మనమ్మాయిని చూట్టానికొచ్చాడే—అతనికి పెళ్ళటమ్మోవ్—" అని వింటాం. అలాంటి ఒక్కొక్క కబురు మనకు సంబంధించిన ఒక్కొక్క వార్తలాగా వినపడుతుంది. అదే అతన్ని గురించి వచ్చే ఆఖరి వార్త కాబోలు. అంతే మరి; పెళ్ళికాని అమ్మాయిలకూ అబ్బాయిలకూ పెళ్ళేగదా అంతం!

శ్యామల హృదయం ఆనందంతో గంతులు వేసింది. అతన్ని చూడగానే ఎవరో ఆత్మీయుణ్ని చూసినట్లయింది. అతను మొహమాట పడుతున్నాడని ఆమె గమనించలేదు. అతనిమీద తను చూపిస్తున్న ఆపేక్ష, అతను కనుపించాక తను కనబర్చిన సంతోషం, సామాన్యుడైన తన భర్తకు అసూయ[illegible] యని తెలిసిన ఆమెలోకజ్ఞానం తాత్కాలికంగా మూగబోయింది.

"ఇప్పుడేం చేస్తున్నారు మీరు?" అనడిగింది శ్యామల మళ్ళీ.

"ఒంగోల్లో సబ్ కలెక్టరుగా ఉంటున్నానండీ—"

అదిరిపడ్డారు వెంకటేశ్వర్లూ, శ్యామలా. రైలుకు ఇంజను అప్పుడే అంటినట్టయింది.

* * *

బెజవాడ స్టేషన్లో సామానంతా దించి, నిద్రపోతున్న అబ్బాయిని ఎత్తుకుని శ్యామలను లేపాడు వెంకటేశ్వర్లు. "అప్పుడే వొచ్చేసిందా బెజవాడ?" అంటూ బద్ధకంగా ఒళ్ళు విరిచి లేచింది శ్యామల. జారిపోయిన పైటసరిగా కప్పుకుంటూ అప్రయత్నంగా కార్నర్ సీట్లోకిచూసింది.

అతను లేడు.

"ఆయనేరీ?" అంది శ్యామల.

"భోజనానికి పోయాడు. బండాగి పది నిమిషాలు కావస్తూంది. పద."

"అయ్యో, వెళ్ళొస్తాననేనా చెప్పలేదండీ—"

"పద పద! చోటుకోసం వాళ్ళవస్థ పడుతున్నారు. చెబుతూంటే నీక్కాదూ?"

"అబ్బ! వొస్తున్నానండీ!" అని విసుక్కుని పిల్లనుతీసింది శ్యామల, లేస్తూ.

ఇంటికి రిక్షా మాటాడుకొని కూర్చున్నారు ఇద్దరూ. శ్యామల మనస్సు పీకుతోంది. 'అతను' ఎంత కాకపోయినా ఏదో కావలసిన వాడనే భావాన్ని చంపుకోలేకపోతోంది. 'సఖ్యం సాప్త పదీనమ్' అని అన్నారు. దాదాపు నూట యాభై మైళ్ళుకలిసి ప్రయాణంచేసి దిగేటప్పుడు "వస్తామండీ" అనైనా చెప్ప కుండా ఎవళ్ళ మట్టుకువాళ్లు వెళ్ళిపోవడం బండిలోనూ అంతకుముందూ జరి గిన దానికి చాలా విరుద్ధంగా వుంది. అతన్ని తొందరగా పెళ్ళిచేసుకోమనీ మరిచిపోకుండా తనను పిలవమనీ మరోసారి చెప్పాలనుకుంది. అతని హోదా తనకు అడ్డదు. లోకానికి అతను సబ్ కలెక్టరు కావచ్చు. కాని తనకు మిత్ర సమానుడు. కలుసుకోడం కష్టమైన మిత్రుల్ని కలుసుకున్నప్పుడు కల్గిన ఆనం దంకంటే, విడిపోయేటప్పుడు వచ్చే వుత్కంఠా, అది తెలియకుండా చూపే ఉత్సాహం, చాలా అనుభవ నీయాలు. రైలు స్టేషనుకు వెళ్ళి దిగబెట్టి రైలు కదిలేటప్పుడు "ఉంటాను. ఉత్తరాలు రాస్తూ వుండేం?" అనడానికి మనస్సులో ఆత్మీయత పేరుకుపోయి ఇంచుమించు అందరికీ హాయిగావుంటుంది. రైలు వెళ్ళాక కాళ్ళలోకివచ్చే బరువు అప్పుడేమాత్రం స్ఫురించదు.

పాడు నిద్ర — ఎప్పుడు పట్టిందో —

అదృష్టవంతుడతను. వాళ్ళ నాయనమ్మ తను చచ్చిపోయేలోగా అతని పెళ్ళి కావాలని పట్టుపట్టిందట. రెండు మూడు సంబంధాలు చూసి ఏమాటా తేల్చుకోలేని సమయంలోనే ఆవిడ పోయిందట. ఢిల్లీ వెళ్ళి ఐ. ఎ. యస్

ప్యాసయి సబ్ కలెక్టరు అయినాడు. ఇంక రెండు మూడేళ్ళలో జిల్లాకలెక్టరూ అవుతాడట.

తన వాళ్ళు తనకు పదిహేడు వెళ్ళి పద్ధెనిమిది రాగానే ఏదో కొంప మునిగిపోయినట్టు సంబంధం చూసి పెళ్ళిచేసి తనను పంపించేశారు. తన భర్త ఇంకా రెండు మూడేళ్ళలో ఏమీ కాడు.

"అతన్లా అందరూ ఐ.ఏ.యస్.కి కట్టరేమండీ?"

వెంకటేశ్వర్లు ఉలిక్కిపడ్డాడు. ఆమె ఇంతసేపూ "అతన్ని" గురించే ఆలోచిస్తోందని స్ఫురించిందతనికి. పరాయివాళ్ళ విషయం శ్యామల ఇంత దూరం పట్టించుకోవడం అతను తొలిసారిగా చూచి ఆశ్చర్యపడ్డాడు. కాని అత నామెను ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు. భార్యాభర్తలు ఒకరొన్నొకరు నిరుత్సాహ పరుచుకొని విషయాలు తుంపేస్తే వాళ్ళ అనుబంధాలు చెడతాయని అతని నమ్మకం.

"కట్టొచ్చు. తెలివితేటలే కాదు, వొడ్డూ పొడుగూ కాళ్ళూచేతులూ బరువు ఏవో కొల్తలు చూసుకోవాలి. కొన్నాళ్ళకిందట వంశమూ సంప్రదాయం కూడా పట్టుదలగా గమనించేవాళ్ళు. పరిపాలనా దక్షతకోసం" అన్నాడతను చల్లగా.

"ఎం.ఏ. పాసవ్వాలా?"

"లేదు. బి.ఏ. చాలు."

—అతను అప్పటికే ఎం.ఏ. అయినాడు. వాళ్ళ నాన్నగారు డిప్టీకలెక్టరు చేసి రిటైరయినాడు. ఒడ్డూ పొడుగూ మనిషిని చూడగానే ఇతగాడు పెద్ద ఉద్యోగంకోసం పుట్టాడనిపిస్తాడు. బ్రిటిషువాళ్ళు మెచ్చుకునే స్ఫురద్రూపం. నాటికి నేటికీ ఒక్కలా తెల్లటి చలవగుడ్డలూ. ఉన్న అవకాశాలన్నీ సద్వి నియోగంచేసుకుని చిన్నతనంలోనే కలెక్టరు హోదా పొందాడు. అతడు అప్పట్లో కట్నం కావాలనలేదు. కావాలనాలేగాని ఇప్పుడు ముప్పయివేలో నలభై వేలో ఇస్తారు! బంగారపు బొమ్మలాటి పిల్లను చేసుకుంటాడు. ఆ అదృష్టవంతురాలు ఎవరో?

తనే అయివుండవలసింది, తనవాళ్ళు తెలివిగా ఆలోచిస్తే. ఇంటిచుట్టూ జవాన్లూ, ఏ ఊరెళ్తే ఆ ఊళ్ళో బంగళా, పలుకుబడీ, పెద్దజీతం, మంచికారూ, గవర్నమెంటు జీపూ, ఇవన్నీ తనవే అవవలిసింది. ఆస్తి. ఆస్తి అంటారు గాని అధికారం ఉన్న వాళ్ళను ఆస్తిపరులూ గౌరవిస్తారుగా!-ఇప్పుడు తను? ఆ సబ్‌కలెక్టరు ఆఫీసులోనే ఒక గుమాస్తా భార్య!

"ఒంగోల్లోనే వుంచేస్తారా, అతన్ని ట్రాన్స్ఫర్ చేస్తూవుంటారండీ!"

"ఎందుకు చెయ్యరు? రెండేళ్ళు తిరిగేసరికి మళ్ళీ ఎక్కడికో–"

"బెజవాడా వెయ్యొచ్చా?"

"ఆ; బెజవాడేం? ఆంధ్రాలో ఎక్కడన్నా వెయ్యొచ్చు; వొకసారి అంధ్రకి ఎలాట్ చేశారు గనక!"

అతను బెజవాడలోనే సబ్ కలెక్టరు అయితే తనకి ఇంతకన్నా బాధగా వుంటుంది కాబోలు. అ పరిస్థితి రాకుండా ఉంటే బాగుణ్ణు!

ఏమిటో—మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్, అంటారు. తన వివాహం భూమిమీదే జరిగుంటుంది,"ఇంతకీ ఘటనుండాలి,మా అమ్మమ్మ చెప్పినట్టు." అని తను అంటే, "ఎవరమ్మమ్మ నడిగినా అంతకన్నా ఏం జెప్తారు?" అన్నా డతను. వెన్నెల ఒలకబోసినట్లు నవ్వి, పల్చటి తెల్లటి అందం అతనిది.వెన్నెలే అతను; అతనే వెన్నెల.

"ఛీ—ఏమిటి నాకీ పాడాలోచనలు!" అనుకుంది శ్యామల. పెళ్ళయిన తరువాత ఈ అయిదాళ్ళలోనూ తనవాళ్ళు తన పెళ్ళి విషయంలో ఏదో పొరపాటు చేశారని అనుకోడం ఇదే మొదటిసారి.అనుకున్నందుకు విచారించినా అందులో ఉందనిపించే నిజం అనిపిస్తూనే ఉంది.

రిక్షా ఆగగానే శ్యామల వాస్తవ ప్రపంచంలో పడింది.

"నేను కేరియర్ పట్టించుకొస్తా గానీ నువ్వింటికెళ్ళి స్నానానికి వేణ్ణీళ్ళు సిద్ధంచేసి పెట్టు. ఇవిగో తాళంచెవులు" అని వెంకటేశ్వర్లు హోటలు దగ్గర దిగాడు.

"తొందరగా వచ్చేయ్యండేం !"

0 0 0

ఇంటికి వెళ్ళి పిల్లలిద్దర్నీ మంచంమీద పడుకోబెట్టి బాయిలరు అంటించి రెండు గదులూ ఊడ్చింది శ్యామల.పదినిమిషాల్లో నీళ్ళుకాగాయి. భర్త రాలేదు. తొరతొరగా రెండు బకెట్లకు నీళ్ళు తొలుపుకొని ఒంటిమీద పోసుకుంది. చీర మార్చుకొని తలా ముఖం సవరించుకొచ్చి హాల్లోకొచ్చింది. ఇంతలో వీధి తలుపు చప్పుడైంది. "వస్తున్నా !" అని తలుపు తీసింది.

"సబ్ కలెక్టరు గారి జవాన్నండి."

"ఊఁహూఁ. ఏం !"

"అయ్యగార్ని పొద్దున్నే ఎడ్గుమాస్టా గారితో కల్సి రమ్మన్నారండి."

"ఏం వేళాపాళా లేదు ? మేం వొచ్చామని అప్పుడే ఎట్టా కనుకున్నారు మీ దొరగారు! ఏమన్నా అంజనం వేశారా?-ఇంకా ఆయన ఇంటికన్నా రాలేదే! ఏమిటీ సంత?-పో, పో!" అని కసురుకుంది శ్యామల.

"ఏందండమ్మగారూ అట్టా అరుస్తారు? ఎడ్గుమాస్టాగారు ఎదుటింటోనే గదండి ఉంటం! వారితో పిచ్చా పాటీ మాట్లాడ్తా వుంటే ఎళ్ళిరమ్మన్నారు. మళ్ళీ పొడుకుంటారేమోనని చెప్పొచ్చా. వార్తో జెప్పండమ్మా-" అని గుమ్మం దిగి చరచరా వెళ్ళాడు జవాను.

శ్యామల తలుపుదగ్గరే నిలబడిపోయింది బిత్తరపడి. తను ఎందుకన్నదో ఆమాటలు, వాడెట్లా జవాబు చెప్పాడో; అంతా మాయగా ఉంది.

"ఏమిటీ, ఎవరదీ? లే!" అంటూ వెంకటేశ్వర్లు వచ్చాడు. అతనికి దారి ఇయ్యటానికి శ్యామల లోనికి నడిచింది.

"ఏముందీ? ఆఫీసు జవానుట! తెల్లారేసరికి రమ్మన్నారట! యింతేగా వుద్యోగం!"

వెంకటేశ్వర్లు వెనకాలే వొచ్చిన హోటలు కుర్రాడు కేరియరు అక్కడే ఉంచబోయాడు: ఇట్రా ఇట్రా అని వాణ్ని లోపలికి తీసుకెళ్ళింది శ్యామల.

వెంకటేశ్వర్లు ఆలోచిస్తూ బట్టలు విప్పుకుంటున్నాడు: కేరియరు లోపల పెట్టిన కుర్రాడు తిరిగొచ్చి హాల్లో నుంచున్నాడు. శ్యామల పంచె, తువాలు తీసుకువచ్చింది.

"కేరియరుకి పొద్దుట రా అబ్బాయి. పనిమనిషి వొస్తుందో రాదో తెలీదు" అన్నాడు వెంకటేశ్వర్లు. "సరేనయ్యా" అని వాడు వెళ్ళాడు.

వాచీ తీసి ఇస్తూ వెంకటేశ్వర్లు "తొమ్మిదీ యిరవై అయిందే! నీళ్ళు కాగాయా?" అన్నాడు. శ్యామల చేతుల్లోంచి తువాలు.పంచె తీసుకుని బాయిలరు దగ్గర కెళ్ళాడు.

భర్త తనకేసి చూడలేదు. తను అన్న మాటకు ఏమన్నా అనుకుంటు న్నాడేమోనని శ్యామల బాధపడింది.

వెంటనే వెళ్ళి "నే తొల్లిస్తా లేవండి—" అంది.

"అక్కర్లేదులే. నువ్వు స్నానం చెయ్యవూ?"

"పోసుకున్నా, లేవండి నే తొల్లిస్తా."

"వెళ్ళి డాబామీద పక్కలువెయ్" అని వెంకటేశ్వర్లు రెండు బక్కెట్లూ బాయిలరు దగ్గరకు తెచ్చాడు.

అతని అభిప్రాయం గ్రహించి శ్యామల వెళ్ళింది.

నిజానికి అర్ధరాత్రప్పుడు రమ్మనడం, ఆదివారాలూ సెలవులూ వర్కు చెయ్యవలసి రావడం, మర్నాడు ఉదయాన్నే ప్రత్యేకం రావలసుంటే తొలి రాత్రి పది పదకొండు గంటలవరకూ కబుర్లు చెయ్యడం, ఇలాంటివి వెంకటేశ్వర్లుకు కొత్తకాదు. ఎంత విసుక్కునేది శ్యామల! వాళ్ళకు పెళ్ళాలూ, పిల్లలూ ఉండరా అనేది, ఒకసారి; తాలూకాలో వర్కు చేస్తున్నప్పుడు డఫేదారుతో అన్న ఈ మాట తాసిల్దారువరకు వెళ్ళింది. భార్య అన్నమాటకు అతని బాధ్యత ఏమీలేదు కాని ఆ మాటను తాసిల్దారు జోక్‌గా మార్చేవరకూ వెంకటేశ్వర్లు ఇబ్బంది పడ్డాడు. జమాబందీల్లో రాత్రి రాకపోవడమూ జరిగేది.... అంత విసుగు శ్యామల ఎన్నడూ చూపలేదు. "ఇంతేగా వుద్యోగం!" అని ఉద్యోగంపైన నిరసనలేదు, డ్యూటీలో ఎగుడు దిగుడులు ఉద్యోగానికి చెందవు: ఆఫీసర్లుగా వచ్చే వ్యక్తులలో మంచి చెడులు ఆ ఉద్యోగాలకు చెందనట్టు.

"ఇంతేగా ఉద్యోగం" అన్న భావం ఇంకో ఉద్యోగి ఉద్యోగంతో పరిపోల్చుకున్నప్పుడు కలగొచ్చు.

కాని ఈ మాట శ్యామల తొందరపడి ప్రయాణపు బడలికా, చికాకూ ప్రోత్సహించగా అన్నమాటేగాని లోతాలోచించి అందులో అర్థం తనకు తగలాలని అన్నమాట కాదని వెంకటేశ్వర్లు ఉద్దేశం. రైల్లో తటస్థపడ్డ ఆయన ఉద్యోగం పెద్దది అన్న విషయం దృష్టిలో పెట్టుకొని శ్యామల ఈ మాట అన్నదేమో అనుకోడానికి అతనికి ప్రాణం ఒప్పలేదు. ఆ విధంగా ఒక తరంగం వస్తే గట్టిగా తోసి వేశాడు,

ఏమైనాసరే ఈ విషయం అతనేమీ ప్రసంగించదలచలేదు. తనలో ఏమైనా అసంతృప్తి రేగితే, శ్యామలే ఆ విషయం దాచుకోకుండా తెలియజేస్తుందని అతనికి తెలుసు.

కాని అట్లా ఆమెను పరీక్షకు పెట్టడమూ అతని లక్ష్యం కాదు. ఆమెను పరీక్షకు పెట్టి విషయం తెలుసుకోటం తనకూ, ఆమెకూ మధ్యవున్న అనుబంధాన్ని కలుషితం చేస్తుందని అతని భావం.

0 0 0

స్నానం, భోజనం అయి డాబామీదకు చేరేసరికి పదిగంటలు కావస్తోంది. శుక్ల చతుర్దశి వెన్నెల విశ్వానికి తెల్ల బట్ట కప్పినట్లుంది. తెల్లటి దుప్పట్లమీద

తెల్లచీర కట్టుకున్న శ్యామలమీద ఆ వెన్నెలపడి, ఆరిపోతాయేమోనని భయపడే అనుభవాల కోరికల్ని వెంకటేశ్వర్లులో రెచ్చగొట్టుతున్నవి. నిశ్శబ్దమయిన ప్రకృతిని సూచిస్తున్నట్టు శ్యామల మౌనంగా వుంది.

"ఏం, అల్లావున్నావ్ ?"

"ఎలా వున్నానూ ?"

"అలిసిపోయినట్టుంటేనూ!"

"నేనేం అలిసిపోలేదు. చక్కగా నిద్దరబోయా రైల్లో."

కాని ఆమె మనస్సు స్వాధీనంలోకి తిరిగి రాలేదు. వెన్నెల చూస్తేనే "అతను" జ్ఞాపకం వస్తున్నాడు. తెల్లటి దుప్పటిమీద కనబడని కిరణాలు ప్రసరిస్తున్న చందమామను చూస్తె ఊహలో అతనే మెదుల్తున్నాడు "అతను వెన్నెల్లా ఉన్నాడు." అన్నది తన భావం. అది ఇవ్వాల్టిది కాదు; ఆనాటిది. విధి తనను అతన్నుంచి విడదీసి ఈనాడు వెన్నెల్లో ఈ తెల్లని అనుభవం రూపం చూపించి పరిహసిస్తూంది. అలిసిపోయి, పాతబడిపోయి, సౌఖ్యాన్నీ, ఫలితాన్నీ మొహం మొత్తించేసిన ఈ అనుభవం నేడేమో కొత్తగా ఉంది. ఆ సమయంలో వివేకం, జ్ఞానం, ధర్మాధర్మజిజ్ఞాస–వీట్ని ఆమె నుంచి వేరుచేసి 'దుశ్శీలం' విజృంభించింది. భర్తే పరాయివాడై తను భర్త సమక్షంలో ఏకాంతంగా ఉంటున్నది. ఊహచిత్రమైన మార్గాలు పట్టి తనను మత్తులోముంచి ఎక్కడికో తీసుకుపోతున్నది. లక్ష్యమూ, మార్గమూ లేని ఆ ఊహ వెంట నీరసంగా నిశ్శబ్దంగా పోతూ, ఉన్నది లేదనుకొని, లేనిది సృష్టించుకొని, బధిర బంధితురాలైంది. ఆ ఊహల్లోంచి వాస్తవానికి వచ్చేటప్పటికి పవిత్రమైన సుఖశిఖరం జారిపోయింది.

అతి గోప్యమైన ద్రోహం అది. దానికి తట్టుకోడానికి ఎంత అనుభవమూ చాలదు.

0 0 0

"నాకిక్కడ బాగా లేదండీ–" అంటూ శ్యామల లేచింది.

కట్టు సవరించుకొని పాపను ఎత్తుకుంది.

"చలేస్తోందా !"

"ఏమోనండీ – కిందికి పోతానూ?"

"నేనూ రానా ?"

"మీ యిష్టం."

"యిక్కడ బాగానే వుంది; మంచుకూడా పడేట్టు లేదు."

"....బాబుని తీసుకొపోనా ?"

"ఒద్దులే. ఉంచు."

తొందరగా మెట్లు దిగి వచ్చింది. పాపను ఉయ్యాలమంచం మీద పడుకో బెట్టి టేబుల్ ఫ్యాను కాళ్ళవేపున స్టూల్ మీద ఉంచింది. పక్కనే మంచం వాల్చుకుని ఒట్టి దిండు వేసుకుని దీపం ఆర్పి పడుకుంది.

నిద్ర రావటం లేదు, ఎంత ప్రయత్నించినా. జాగ్రదవస్థలో ఉన్నంత సేపూ ఆలోచన తప్పదు. గుప్పెట్లోనూ, సీసాలోనూ శూన్యాన్ని సాధించడం. మస్తిష్కాన్ని ఖాళీగా ఉంచడం - ఒకదానికంటే ఒకటి కష్టం. మొదటిదానికి సైన్సు సహాయం లభిస్తుంది. రెండోదానికి భౌతిక సహాయం లేదు. ఆధ్యాత్మిక చింతన, ధ్యానం చేస్తె వీలవుతుంది. వాట్ని అలవర్చుకోడానికి కొంత పారిశుద్ధ్యం పరిపూర్ణతా అవసరం. అవి మొదలయ్యే చోటుకు శ్యామల ఇంకా చేర లేదు,

ఈ రోజు ఎంత అన్యాయం జరిగిపోయింది! అతన్ని చూపించి విధి తనను పరీక్షించి పరిహసించింది. పరీక్షలో తనునెగ్గ లేక చెయ్యకూడని పాపం చేసేసింది. తనలో ప్రవహిస్తున్న రక్తానికీ ఆత్మకూ చుట్టరికం లేదు. పైకగు పించని ఈ బాధ తను ఎట్లా భరించడం? భర్తకాదుగదా, ఆత్మకూడా ఈ బాధను పంచుకోదు. తనకు తనే చేసుకున్న ఈ ద్రోహానికి ప్రాయశ్చిత్తంగా తననుంచి తనే దూరంగా పారిపోవాలి. ఎక్కడికి? ఎక్కడికి పోయినా ఈ బాధ తనను వెంటాడుతూనే ఉంటుంది. ఎవరో ఎర్రగా మండుతున్న కొరివితో తనను కాలుస్తున్నాడు. శరీరం పాప చింతనాగ్నిలో దగ్ధమై వ్రణాలవుతోంది.

చీకట్లో ఫ్యానురొదలో వేయికంఠాలు తనవేపు తిరిగి ఏమేమో అరుస్తు న్నట్లుంది. కళ్ళు మూసుకున్నా కనబడే ఆ భీకర దుష్ట స్వరూపం తన ప్రతి బింబమేనని ఊహించుకొని చెప్పరాని ఆవేదన అనుభవించింది శ్యామల. మని షికి ఒంటరితనం కంటే శత్రువు, శిక్ష ఏమున్నాయి!

ఆరేళ్ళుగా భర్తతో కాపురం చేస్తూ. అతనే తనై, తనే అతనై గాటు తప్పని బండిలాగా సరళంగా సంతోషంగా జీవితయానం సాగిస్తున్న తనను, ఈ రోజు అతను కనబడి తలక్రిందుగా నించోబెట్టాడు. సాముర్లకోటలో మెయిలు

ఎక్కేవరకూ ఉత్సాహంగా ఉన్న తనను; ఈ గొడవ ఊహించడానికైనా అవసరంలేని తనను; ఇందులో దింపి ఏడ్పిస్తున్నాడు.... క్రూరుడతను!

పాపం అతను మటుకు ఏం చేశాడు! అమర్యాదగాగాని అపసవ్యంగాగాని ప్రవర్తించలేదు. తనే అతన్ని గుచ్చిగుచ్చి, మీదేవూరు? ఇప్పుడేం చేస్తున్నారు? అని అడిగింది. అతను సాధ్యమైనంత సిగ్గుపడి ఎలా చెప్పనండీ అంటూనే తన కర్థం కాదనుకొని గాబోలు ఇంగ్లీషులో చెప్పాడు. అతన్ని పరకాయించిచూసి, ఫలానా అని తెలిసి ఊరుకోక పదే పదే పృచ్ఛించడంలో తనకు తెలియకుండా తనపైన స్వారీచేసే ఒక ఆధిక్య భావావేశం ఉంది. పెళ్ళి చూపులకు వచ్చిన తరవాతకూడా వాళ్ళకు ఆస్తిపాస్తులు లేవని తిరస్కరించి అనాడు వాళ్ళి తన వాళ్ళు అవమానించారు. ఈనాడు నీవెవరు, నేనెవరో తెలుసుగా! నాకు పెళ్ళయిందిలే; ఇదుగో నా భర్తా నా పిల్లలూ చూశావా! అని చెప్పుకోబోడం- ప్రదర్శన- అతన్ని అవమానించడమే. నాడూ, నేడూ క్షణికమైన అధిక్యాన్ని పురస్కరించుకుని నిజమయిన విలువను అవమానించిన దోషం తనది- తనే దోషి.

అయినా ఇంత శిక్ష తగదు. చిరకాల సముపార్జితమైన పావిత్ర్యం ఉద్రేకజనకమైన ఒక్కదోషంతో దగ్ధమైపోయి ప్రత్యక్షదైవం ఎదుటా, ఆత్మ ఎదుటా విచారణ పొందవలసి రావడం అన్యాయం.

తను చేసినది తప్పయినా సామాన్యమైనదిగా కనుపించదు; ఆత్మసాక్షిగా, భర్త సమక్షంలో అతనిసరంగా ఆలోచించి, భర్తని స్వల్పానికి తూలనాడింది; భర్తలో అతన్ని ఊహించుకొని మానసిక వ్యభి—— ఛీ!

“భగవంతుడా!” అని ఒక కేకపెట్టింది శ్యామల. కాని ఆ కేక ఆమెకే వినిపించలేదు. గాద్గద్యంతో ఆమె కంఠం మూసుకుపోయింది.

0 0 0

“లెగవండమ్మగోరూ!” అంటూ పనిమనిషి లేపేవరకూ మెలకువే రాలేదు. రేడియో మీద అలారం టైమ్‌పీస్ చూసింది; దానికి కీ ఇస్తేగా తిరగడానికి! అనుతుంటూనూ, అది ఎనిమిదింపావు చూపిస్తోంది. రేడియో ఆన్ చేసి సరిదిద్దుదామని కీ ఇవ్వబోయింది. గడియారం తిరుగుతూనే వుంది. రాత్రి ఆయన కీ ఇచ్చారేమోలే అనుకుంది.

“ఎంత నిద్దర బొయ్యావమ్మా.” అని పనిమనిషి నిట్టూర్చి చేతులు తిప్పింది.

"అబ్బ! ఏమిటే నీ సొద!"

"సొదేం దండమ్మగోరూ! ఐగారు ఆఫీసుకెలి పొయ్యారుగా. సందు మొగలనే గనపడి దణ్ణం బాబూ అంటే యింటికెల్లమంటిరి. తమురులెగిసే వున్నారనుకుంటుండా!" అని చదివింది పనిమనిషి.

శ్యామలకు పూర్తిగా తెలివొచ్చింది. అయితే టైము ఎనిమిదింపావు అయిందన్నమాట. వెంకటేశ్వర్లు విషయం ఆమెకు కొత్తగాదు. పిడుగులు పడుతున్నా సరే డ్యూటీకి ఎగనామం పెట్టడు. రాత్రి కబురొచ్చిందో లేదో పొద్దుటే లేచి వెళ్ళాడన్నమాట.

"సరే నీళ్ళుతోడు బాయిలర్లోకి" అంటూ గదిలోకి వెళ్ళి టూత్ బ్రష్ తెచ్చుకుంది శ్యామల.

"బాయిలేర్లో నీళ్ళు కాగుతుండాయమ్మగోరూ!"

"సరే కుంపటి వెలిగించు. డాబామీద చిన్నయ్యగారింకా పండుకున్నాడుగాబోల్లేపి తీసుకురా!-"

ఏమీలేదు, చిన్నయ్యగారు లేచి వాళ్ళనాన్నగారితో కాఫీ తాగేసి పెరట్లోకి వెళ్ళి ఆడుకుంటున్నాడు. కుంపటి పక్కన కాఫీ గిన్నెలూ, కుంపటిమీద సన్నగా కాగుతున్న పాలూ! అనుమానించి మేకున ఉన్న ప్లాస్కుచూస్తే బరువుగా వుంది.

శ్యామల సిగ్గుతో చచ్చిపోయింది.... రాత్రి ఆ దిక్కుమాలిన ఆత్మ పరిశీలన దప్పించుకోడానికి వీల్లేనిదైంది. అందులో ఎప్పుడు నిద్దరపట్టేసిందో! ఆయన పాపం తెల్లవారుజామున చాలా తొందరగా లేచుండాలి. పాలు పిండే మనిషి బర్రెను తీసుకుని అయిదుకాక ముందే వచ్చేస్తుంది. అప్పుడనగా లేచి, ఈ పనులన్నీ చక్కబెట్టి ఎనిమిది ప్రాంతంలో ఆఫీసుకు వెళ్ళాడన్నమాట. ఇవన్నీ చూసి పనిమనిషి నవ్వుతోంది కూడాను. ఛీ; మొద్దునిద్దరా నేనూను! ఎంత పనైంది! అనుకుంది.

పిల్లలిద్దరికీ నీళ్ళుపోసి దను పోసుకుని వంట పూర్తిచేసేసరికి పదిన్నర దాటింది. వేడివేడన్నం పిల్లలిద్దరికీ పెట్టేసి ఇవతలికి తీసుకొచ్చింది. వీధి తలుపు చప్పుడైంది.

ఆఫీసు జవాను—

"అయ్యగారు తొందర పనుండి బందరెళ్ళారండి. రాగవయ్యగారి దగ్గి

రుచ్చుకున్నారండి యిరవై రూపాయలు. తమర్నడిగి వారి కియ్యమన్నారండి. ఇదిగో చీటి."

సరిగా మెదడులో ఇమడలేదు శ్యామలకి.

"బందరెళ్ళారూ?"

"మరేనండి."

"ఎందుకూ?"

"ఏదో అర్జంటు పనిటండి. దొరగారు బంగళాకి పిలిపిచ్చుకుని జీపులో ఎక్కించుకు పొయ్యారండి."

"భోజనమో?"

"ఇంక బోజన వేఁటండి; ఎవురూ దిన్లా, అమీన అయ్యగారు డబ్బు ల్దెచ్చుకోలేదని యిదవుతావుంటే రాగవయ్యగారిల్లు దగ్గెరగదాని నే బోయి దెచ్చిచ్చా."

చీటీ చూసింది శ్యామల. ఇంట్లోకెళ్ళి డబ్బు తెచ్చియిచ్చింది.

"రాత్రి కొచ్చేస్తారుగా!"

"ఎట్ట తెలుసుద్దండి? ఎళ్ళం మనిష్టం గాకపాయె. రాటం మనిష్టమా!" అనివాడు వెళ్ళిపోయాడు.

దిగాలుపడి కూచుంది శ్యామల.

అర్జెంటు పనులు వస్తూనే ఉంటాయి. ఇంటికి వచ్చి చెప్పి వెళ్ళకూడదా? చేతిలో డబ్బులేకపోయినా ఇంటికి రావాలని బుద్ధి పుట్టలేదు? రాఘవయ్యకు కబురు చేసి- తిండీ తిప్పలూ లేక కట్టుబట్టలతో అప్పుచేసి వెళ్ళిపోవాలా? ఇది ఎప్పటి డ్యూటీకాదు. ఇందులో ఏదో ఉంది.తన మాటా ప్రవర్తనా గుర్తించి తనను శిక్షిస్తున్నారా ఆయన?

కబురు తెచ్చిన జవాను! వాడి మాటలు! కొంచెం తిన్నగా ఏడవకూడదూ వాడైనా! వాడికంతా తెలుసన్లే ఉంది!

ఆలోచనలో అశ్వాసలతో శ్యామల అలాగే గంటలు గడిపేసింది. మధ్య మధ్య పిల్లల ఆట, నిద్రపోవడాలు,కిటికీ రెక్కల చప్పుళ్ళు. పోస్టుమన్ కేక- ఇలాటివి స్వల్పంగా కదిల్చినా ఆలోచనలనుంచి తప్పించుకోలేక పోయింది.

సాయంకాలం హెడ్మాస్టారు శంకరంగారు ఇంటికి వస్తాడు గదా; ఆయన్ను డిగితే వివరం తెలుస్తుందనీ, అసలాయనతో కలిసి భర్తవచ్చేస్తాడనీ కొంత

ఆళ. అతనికోసం చూడగా చూడగా చివరికి రాత్రి ఎనిమిదిన్నరకు వచ్చారు, రిక్షా వాళ్ళింటి గగ్గర ఆగగానే గబగబా వెళ్ళింది శ్యామల.

"ఏమమ్మాయీ ఇట్లా వొచ్చావూ? రా. కూర్చో!" అంటూ లోనికి వెళ్ళాడాయన. హెడ్డు గుమాస్తా గారి భార్యవచ్చి "శ్యామలా యేమిటి' వోహోహో- రామ్మా,రా. ఏమిటి విశేషాలు? చెల్లెలు పెళ్ళి విశేషాలు చెప్పు ముందుగా!" అంటూ పలకరించింది.

శ్యామలకు ఇరకాటంగా ఉంది. కోటూ పాగా తీసేసి శంకరంగారు ఇవతలికొచ్చాడు. "ఏమమ్మాయీ,పొద్దుపోయొచ్చావూ! మీ అయన రాలేదట్టుందే బందర్నుంచి?" అన్నాడు,

"మరేనండీ- సాయంకాలాని కొస్తానని కబురు పెట్టలేదు. మీకు తెలుసేమోనని——"

"తెలిసేదేముంది? వెళ్ళిన వాళ్ళంతా వొచ్చేశారుగా?"

"అందరూ వొచ్చేశారాండీ!"

"ఆ, అంతా వొచ్చేశారు! రేపు శనివారం లోపుగా బిజినెస్ తిటర్న్సు పంపాలి. ప్రతీ వాడ ఫ్లోనూ వర్కు- హెవీగా వుంది. ఇవాళ కలెక్టరు క్యాన్పరెన్సు. క్యాంపు క్లర్కు-కి జ్వరమైతేనూ మీ అయనకి షార్ట్‌హాండ్ తెలుసుగద్దాని సబ్కలెక్టరు వెంబడేసుకు పొయ్యాడు. వాళ్ళంతా సాయంకాలనికే వొచ్చేశారు. మరి యీన ఎవరన్నా ఫ్రెండ్సుతోవుండి బస్సులోగాని వస్తాడేమో?

ం ం ం

ఆ మర్నాడు సాయంకాలం హెడ్గుమాస్తా శంకరంగారే వచ్చారు. "అమ్మాయీ!" అని కేకేస్తూ.

శ్యామల గదిలోంచి హాల్లోకి వచ్చింది. కొంగుపట్టుకుని అబ్బాయి వచ్చాడు. వాడిచేతుల్లో పిప్పరమెంట్ల ప్యాకెట్ ఒకటి పెట్టాడు శంకరంగారు.

"అదేమిటండీ?" అని వారించింది శ్యామల,

"అబ్బే ఏంలేదమ్మా! పసిపిల్లాడు. చూసిచాల రోజులైందిగా-"

శ్యామల మొహం పొంగి కళ్ళు బరువుగా వున్నాయి.

"ఏమమ్మాయీ అట్లావున్నావు? ఇవ్వాళా రాలేదుగా, వెంకటేశ్వర్లు? ఏమయిపొయ్యాడు, ఎటు పొయ్యాడు?"

"వారి పని పూర్తిగాలేదేమోనండి, బందర్లో-" దుఃఖం దిగమింగుకుంటూ అంది శ్యామల.

"నా బొంద, వారి పనీ నా పనీ అక్కడేముందమ్మా! ఇందతా గవర్న మెంటుపనీ, సబ్ కలెక్టరు పనీ—

"అయినా నాకు తెలియని పనేముందతనికి బందర్లోమటుకు? లేదు! ఇందులో ఏదో వుంది. అయితే అమ్మాయీ, ఒక్కటడుగుతాను. ఏమను కోకుండా చెబుతావూ?"

శ్యామల పరిస్థితి అయోమయంగా వుంది.

"నా అనుమానం ఏమిటంటే- ఏమన్నా పోట్లాడి వెళ్ళాడా అని! పెళ్ళికి గదా వెళ్లారు! అక్కడ లాంఛనాలూ వాటివిషయంలో లేదా యింకో నాలుగు రోజులక్కడుండం విషయంలో ఏదన్నా మాటా మాటా అనుకున్నారేమో! ఒక వేళ!- చూడమ్మాయీ ఇది ఎలాంటి సైమంటే- బిజినెస్ రిటర్న్స్ సైమ్. అందరూ కష్టపడి పనిచెయ్యాలి. రెండు రోజులు ఆబ్సెంటయినాడంటే అతని కెంత నష్టం !- అసలే పది రోజులు సెలవు వాడేశాడు- వర్కుకి ఎప్పుడూ ఎగనామం పెట్టడే అతను; నువ్వు చూస్తె ఇట్లా వుంటివి- అతనేమో తొందర పడే మనిషికాదు-ఇట్లా ఎందుకు చేశాడో మరి? నాతో చెప్పమ్మా ఏదన్నా వుంటే- మీ ఫాదర్లాంటి వాణ్ని."

శ్యామల మాట్లాడలేదు. రాతి బొమ్మలాగా నించుంది, దుఃఖం పొంగి వస్తూంది.

"సరేలే. నేనెళ్ళొస్తా. ఇప్పుడో ఇహనో వస్తాడనే అనుకుందాం. రాగానే కాస్త కనబడమని చెప్పు."

వెళ్ళాడు.

ఈసారి శ్యామలకు దుఃఖం ఆగలేదు. ఏడ్చేడ్చి అలసిపోయిందామె. ఏదీ మామూలుగా జరగటంలేదు! మూడు రోజులు మూడుయుగాలైనై. ఇది ఇంకా ఇలాదేనికి దారితీస్తుందో! పోట్లాడుకున్నారనికూడా అనుకుంటున్నారన్న మాట. ఇది అక్షరాలా హెడ్ గుమాస్తాగారి ఇంట్లోనుంచి వచ్చిన బులెటిన్. సందేహంలేదు. అయితేనేం; ఇది ఆఫీసులో ప్రాకటానికి ఎంతోసేపు పట్టదు శంకరంగారు ఏం చెప్పదల్చుకున్నా గుమాస్తాలందరూ చుట్టూ చేరుతారుట.

గుమాస్తాలందరి మధ్యా ఈ విషయం చెప్పడమూ, వాళ్ళు వప్పుకుని ఇళ్ళలో, ఆ పక్క, ఎదురు ఇళ్ళలో, వాడల్లో చెప్పడమూ, తమకు జరగని గృహకల్లోలం గాధగా రూపొందడం ఊహించుకుంది శ్యామల. ఆమె హృద యం కల్లోలమైంది. ఊహ భయంకర మార్గాలు పట్టింది.

విధి తనను ఎందు కిలా పరిహసిస్తూంది?

తొమ్మిదైంది. భోజనం మీద ఆపేక్ష కలగలేదు. వంటింట్లో అన్నీ చక్కబెట్టుకొని వద్దామని లేచింది. తలుపు చప్పుడైంది, ఉలిక్కిపడింది శ్యామల.

తలుపు తెరుచుకొని వెంకటేశ్వర్లు లోనికి వచ్చాడు. బుట్టతో మామిడి పళ్ళు కాబోలు తీసుకొని రిక్షా అబ్బాయి వెనకాలే వచ్చాడు.

"సారీ శ్యామలా; చెప్పకుండా వెళ్ళాను!" అంటూ వెంకటేశ్వర్లు గదిలోకి వెళ్ళాడు.

శ్యామల ఎక్కడున్న దక్కడే నిలబడిపోయింది.

వెంకటేశ్వర్లు రెండు నిమిషాల్లో ఇవతలి కొచ్చాడు బట్టలు మార్చుకుని.

"కాళ్ళు కడుక్కోండి."

"ఏమిటి భోజనమా? ఊఁహుఁ. దార్లోనే ఆగి హోటల్లో తినొచ్చాను; మళ్ళీ యింత రాత్రప్పుడు నువ్వేమవస్థ పడతావనీ-

శ్యామల మళ్ళీ అదిరి పడ్డది.

"నన్నెందుకిలా అన్యాయం చేస్తున్నారూ?" అని అడిగింది. అణుచుకోలేని భావాలను తెలియజేయటానికి ప్రారంభించిన ఈ వాక్యం బరువుగా ముక్కముక్కలుగా వచ్చింది. ఆమెకు ఏడుపు ఆగలేదు;

"ఛా,ఛా; ఏడుస్తావేం !" అన్నాడు వెంకటేశ్వర్లు దగ్గరగావచ్చి.

"నాకు తెలుసు, నాకేం చెప్పకండి, నేను తప్పుచేస్తే నన్ను దండించండి. కాని యిలాగా ?" అని కన్నీళ్ళలోంచి గాద్గద్యంలోంచి అన్నది.

వెంకటేశ్వర్లు నీరయిపోయినాడు. దుఃఖించటానికి శ్యామల కెంత అనుభవం లేదో ఊరడించటానికి అతనికి అంతకంటే అనుభవం లేదు.

"లేదు శ్యామలా- నువ్వేం తప్పుచేశావూ? ఛీ ఛీ; తప్పు కాదూ- ఏమిటా మాటలు? నేను చెప్పకుండా వెళ్ళినందుకేగా! పాపం మూడు రోజులూ పూట పూటా వొండుకునిచూశావు కాబోలేం-?, సారీ శ్యామలా! మనం కాకినాడెళ్ళే ముందు అమ్మ నూతి దగ్గర కాలుజారి పడిందని లెటరొచ్చిందిగా? చూదామని మావూరెళ్ళాను. కాకినాణ్నుంచి వొచ్చేప్పుడే దిగుదామంటే మనసొప్పలేదు. సరిగ్గా పంధొమ్మిదికి డ్యూటీలో ఉండాలని సబ్కలెక్టరు ముందుగా చెప్పాడు. బందర్లో కాన్ఫరెన్సు అయినాక ఈ రెండు రోజులూ పబ్లిక్ హాలీడేస్ కదాని

అడిగితే పోయి రమ్మన్నాడు. అబ్బ! ఎట్లా అయిపోయినావు- ఏమిటీ కళ్ళు! ఎంతసేపట్నుంచీ ఏడుస్తున్నావ్?"

శ్యామల శరీరమే ఆర్ద్రమైపోయింది. భర్తకేసి ఒక్కసారి చూసి కాళ్ళ దగ్గర చతికిల బడ్డది, రెండు కాళ్ళనూ పెనవేసుకుని "నన్ను క్షమించండి. మీ మనస్సు కష్టపెట్టాను. తప్పు చేశాను, పాపిష్టిదాన్ని..." అన్నది అతని మోకాళ్ళమీద తల ఆనించి,

అక్కడికి విడుదలైన నిట్టూర్పులో భూభారంఅంతా ఉంది. పాపానలంలో కాలిన హృదయం పశ్చాత్తాప వాహినిలో ప్రక్షాళితమైనట్లు శ్యామల తేలిక పడింది.

"ఏ తప్పూలేదు- లేలే అన్నం తిందువు గాని" అన్నాడు వెంకటేశ్వర్లు ఆమెను లేవదీస్తూ.

*

ముళ్ళపూడి వెంకట రమణ గారికి ఈ కథ అంటే చాలా ఇష్టం, ఎప్పుడో ఒకనాడు ఈ కథ ఆధారంగా ఒకసినిమా తీస్తానని అంటూ వుండే వారు.

'చాందినీ- కీ-ఛాయా' అనే పేరుతో ఈ కథ హిందీలోకి వెళ్లి "తెలుగూ-కే-ప్రతినిధి- కహానియా" అనే కథా సంపుటంలో అచ్చయింది. ప్రచురణ కర్తలు: "దక్షిణ భారతహిందీ ప్రచారసభ" ఆ పుస్తకాన్ని పాఠ్యగ్రంధంగా పెట్టించి లక్షల కొద్దీ కాపీలు అమ్ముకున్న ఆ హిందీ భాషా సేవా సంస్థ వారు నా కథ హిందీలోకి తర్జుమా చేయిస్తున్నామని నాకు చెప్పడంగాని, హిందీ ప్రచారానికి పుస్తకంవల్లా వచ్చిన నిధులనుంచి నాకో తృణమో పణమో ముట్ట చెప్పడం గాని, చెయ్యలేదు, పైగా-ఏమర్రా ఇలా చేసేరు-అని నేను ఉత్తరం రాస్తేకూడా సమాధానం లేదు. 'హిందీ' దేశానికి ఎంత స్వాతంత్ర్యం ఉన్నా ఇంతలాంటి "కాపీ (చేసే) రైటు" రైటు కాదేమో అని నాకు అనిపిస్తూ వుంటుంది.